www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 2 జనవరి 2023



వైకుంఠ ఏకాదశి సర్వదర్శన టోకెన్ల ప్రారంభం

- భక్తుల రద్దీతో వేకువజామునుండే మంజూరు
- ఆదివారం సాయంత్రానికి 2లక్షల టోకెన్లు పొందిన భక్తులు

ప్రజాశక్తి -తిరుమల: తిరుమల శ్రీవారి వైకుంఠ ఏకాదశి టోకెన్ల కౌంటర్లలో భక్తుల రద్దీ కారణంగా ఆదివారం వేకువ జామునుండే సర్వదర్శన టోకెన్లను టిటిడి మంజూరు చేసింది. ఆదివారం మధ్యాహ్నం నుండి ఇవ్వాలని మొదట ప్రకటించిన ముందు రోజు నుండే క్యూలైన్లలో భక్తులు వేచి ఉన్నారు. స్వల్పంగా తొక్కిసలాటలు జరగడంతో టిటిడి మంజూరు ప్రక్రియను ప్రారంభించింది. దీంతో ఉదయం 9 గంటల లోపు దాదాపు లక్షన్నర టికెట్లను భక్తులు పొందారు. టీటీడీ మరో మూడున్నర లక్షల టికెట్లను నిరంతరాయంగా మంజూరు చేసి కౌంటర్లను మూసివేయనుంది.

గూడూరు అభివృద్ధి అంతంతమాత్రం..!

- గందరగోళంగా మున్సిపాలిటీ విలీనం
- మంజూరు కాని ప్రభుత్వ నిధులు
- పురపాలకలో జరగని ఎన్నికలు
- అవస్థలు పడుతున్న విలీన గ్రామాల ప్రజలు

ప్రజాశక్తి-గూడూరు

గూడూరు పురపాలక సంఘం అస్తవ్యస్తంగా మారింది. గ్రేడ్-1 మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసినప్పటి నుంచి అటు మున్సిపాలిటీకి గాని ఇటు విలీన గ్రామాలకు గాని ప్రభుత్వం ఎన్నికలను నిర్వహించకపోవడంతో పట్టణ ప్రజలతో పాటు విలీన గ్రామాల ప్రజలకు గందరగోళ పరిస్థితి నెలకొంది. పంచాయతీలో ఉన్నామా.. మున్సిపాలిటీలో ఉన్నామా. అన్న మీమాంసలో ప్రజలు ఉంటున్నారు. గూడూరు పురపాలక సంఘంతో పాటు విలీన గ్రామ పంచాయతీలైన చిల్లకూరు, దివిపాలెం, పోటుపాలెం, నెల్లటూరుతో పాటు చెన్నూరు గ్రామ పంచాయతీని గూడూరు పురపాలక సంఘంలో విలీనం చేశారు. ఈ ఐదు పంచాయతీలతో పాటు గూడూరు పురపాలక సంఘానికి ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించలేదు. తమ గ్రామాలను గూడూరు పురపాలక సంఘంలో విలీనం చేయవద్దంటూ పైగ్రామాల ప్రజలు హైకోర్టును ఆశ్రయించారు. ఇదిలా ఉండగా విలీన గ్రామాలతో కలిపి ప్రభుత్వం గూడూరు పురపాలక సంఘాన్ని గ్రేడ్‌వన్ పురపాలక సంఘంగా ప్రకటించింది. దీంతో కేంద్ర ప్రభుత్వం నుంచి అధిక మొత్తంలో పురపాలక సంఘానికి నిధులు వస్తాయన్న ఆలోచనతో చేసినా దీనికి సంబంధించి గూడూరు పురపాలక సంఘం గ్రేడ్ వన్ అయినా నిధులు మాత్రం విడుదల కాలేదు. దీంతో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ఐదు గ్రామాలకు సంబంధించి గూడూరు పురపాలక సంఘం పారిశుధ్య నిర్వహణ, వీధిలైట్ల నిర్వహణ అంతంతమాత్రంగా మారింది. అయితే ఇంటి పన్నులు మాత్రం కట్టించుకుంటున్నారు. తమ గ్రామాలను గూడూరు పురపాలక సంఘంలో విలీనం చేయడం వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ ప్రజలు కోర్టును ఆశ్రయించారు. పంచాయతీ పాలకవర్గం ప్రమేయం లేకుండానే పంచాయతీ కార్యదర్శుల ఏకగ్రీవ ఆమోదంతో మున్సిపాలిటీలో విలీనం చేయడానికి ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శులతో సంతకాలు పెట్టించి పురపాలక సంఘంలో విలీనం చేసినట్లు ప్రకటించారు. అటు పురపాలక సంఘానికి గాని విలీన గ్రామాలకు గాని పాలకవర్గాలు లేకపోవడంతో వాటిని ప్రశ్నించే నాయకుడు లేకుండా ఏకపక్షంగా విలీనం చేయడంపై పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా మండల కేంద్రమైన చిల్లకూరును కూడా గూడూరు పురపాలక సంఘంలో విలీనం చేయడం ఏమిటని ఆ మండల ప్రజానీకం ప్రశ్నిస్తున్నారు. వీటన్నిటిని పురపాలక సంఘంలో కలపకుండా గ్రామ పంచాయతీలు గానే ఉండనిచ్చి ఎన్నికలు నిర్వహించాలనేది మెజారిటీ ప్రజల అభిప్రాయంగా ఉంది. ఇటీవల ప్రభుత్వం వద్ధాప్య వితంతు ఒంటరి మహిళలు వికలాంగ పింఛన్లను భారీ ఎత్తున కోత విధించి లబ్ధిదారులను తీవ్ర ఆందోళనకు మనో వేదనకు గురిచేసింది. దీనిపై తమ కష్టసుఖాలు ఎవరికి చెప్పుకోవాలన్న పాలకవర్గం లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉండగా అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రతి గ్రామంలో సచివాలయాలు ఏర్పాటై ఉన్న సమాచారం లబ్ధిదారులకు అందడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికీ ప్రజలు తాము పురపాలక సంఘ పరిధిలో ఉన్నామా.. పంచాయతీరాజ్‌లో ఉన్నామన్న సందేహంతో అయోమయంలో ఉన్నారు. హైకోర్టు నుండి విలీన గ్రామాలకు సంబంధించిన తీర్పు రాకముందే ఏకపక్షంగా తమ గ్రామాలను ఎలా మున్సిపల్ పరిధిలోకి తీసుకుంటారని అధికార పార్టీకి చెందిన నాయకులే అధికారులను ప్రశ్నిస్తుండటం విశేషం. అదే పురపాలక సంఘానికి పంచాయతీలకు పాలకవర్గం ఉన్నట్లయితే ఈ సమస్య ఉత్పన్నమై ఉండేది కాదని పాలకవర్గం లేని సమయంలో ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయం కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పలువురు నాయకులు పేర్కొనడం విశేషం. ఇటీవల పింఛన్లలో భారీ కోత విధించి పింఛన్లతోపాటు భారీగా రేషన్ కార్డులను తొలగించే ప్రక్రియ చేయడంతో ప్రజల నుండి అటు ప్రతిపక్ష పార్టీల నుండి తీవ్ర విమర్శలను ప్రభుత్వం మూటగట్టుకుంది. ఒక పథకానికి అర్హులను లబ్ధిదారులను ఎంపిక చేసే సమయంలో వాలంటీర్ పారదర్శకంగా వ్యవహరిస్తే ఈ సమస్యలు ఉత్పన్నం అయ్యేవికావని నాయకులు పేర్కొంటున్నారు. 50 గహాలకు ఒక వాలంటీర్ ఉన్నందున ఆ 50 ఇళ్ల యజమానుల స్థితిగతులు గతంలో రాజకీయ ప్రమేయంతో అర్హులుగా ప్రకటించి నేడు అనర్హులుగా ఎలా ప్రకటిస్తారని అధికార పార్టీకి చెందిన నాయకులే ప్రశ్నించారు. కోర్టు తీర్పు వచ్చేవరకు తమ గ్రామాలను పంచాయతీల గానే ప్రకటించాలని ఆ పార్టీ నాయకులు పేర్కొనడం విశేషం. ఇకనైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

'కోవిడ్'ను సమర్థవంతంగా ఎదుర్కొంటాం

జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ప్రకాశం

ఇంటర్వ్యూ

వైద్య ఆరోగ్యశాఖ జిల్లా అధికారి డాక్టర్ ప్రకాశం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఓమిక్రాన్ వెరియంట్‌ను ఎదుర్కొవాడానికి వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందిని సన్నర్థం చేశాం. జిల్లా వ్యాప్తంగా ఉన్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పూర్తిగా అప్రమత్తంగా ఉన్నారు. ఇప్పటికే కరోనా లక్షణాలను గుర్తించిన వ్యక్తులకు అవసరమైన వైద్య సదుపాయాలు కల్పించేలా ఏర్పాట్లు పూర్తిచేశాం. తిరుపతి జిల్లాలో కరోనా లక్షణాలు కొంత మేరకు కనిపించాయి. చిత్తూరు జిల్లాలో ఓ వ్యక్తికి కరోనా లక్షణాలు కనిపించాయి. కరోనా సోకిన్నట్లు నిర్ధారణ కావడంతో మెరుగైన వైద్యం అందించడం జరుగుతోందని జిల్లా వైద్య అధికారి డాక్టర్ ప్రకాశం తెలిపారు.

ప్రజాశక్తి: థార్డ్‌వేవ్ కరోనా ప్రభావం ఏ మేరకు ప్రభావం చూపే అవకాశముంది?

డిఎంఅండ్‌హెచ్ఒ: మొదటి, రెండు కరోనా సోకిన సమయాల్లో ప్రాణ నష్టం జరిగింది. రెండో వేవ్‌లో పెద్దసంఖ్యలో మృతుల సంఖ్య పెరిగింది. మూడో వేవ్‌లో ప్రాణనష్టం ఉండకపోవచ్చని అంచనా వేస్తున్నారు.

ప్రజాశక్తి : కరోనా సోకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

డిఎంఅండ్‌హెచ్ఒ: వైద్యఆరోగ్యశాఖ సూచన మేరకు మాస్క్‌లు ధరించడం తప్పనిసరి. ఇప్పటికే మాస్క్‌లు తప్పనిసరి చేస్తూ ఆదేశాలు జారీ చేయడం జరిగింది. అలాగే వ్యక్తిగత శుభ్రత అవసరం తరచూ చేతులను శుభ్రం చేసుకోవడంతో పాటు శ్యానిటైజర్లు వాడాలి. చిన్న పిల్లలు, వృద్ధుల విషయంలో జాగ్రత్తలు పాటించాలి.

ప్రజాశక్తి : ఎలాంటి ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు...?

డిఎంఅండ్‌హెచ్ఒ: ప్రస్తుతం కరోనా సోకినవ్యక్తుల కోసం జిల్లాలోని వివిధ ఆసుపత్రుల్లో 4,10 బెడ్లు సిద్ధం చేశాం. 156 అక్సిజన్ సిలిండర్లతో పాలు వందకు పైగా వెంటిలేటర్లు ఏర్పాటు చేయడం జరిగింది. నాన్ అక్సిజన్ బెడ్లు 250ఉన్నాయి. వైద్య సహాయం అందిచేందుకు స్టాఫ్ నర్సులను నియమించడం జరిగింది.

ప్రజాశక్తి: బూస్టర్ డోస్ పరిస్థితి ఏమిటి?

డిఎంఅండ్‌హెచ్ఒ: ప్రభుత్వ నిబంధనల మేరకు కరోనా టీకాలు వేసుకున్న వారికి బూస్టర్ డోస్‌లు అర్బన్ హెల్త్‌సెంటర్లు, పిహెచ్‌సీలో వేయడం జరుగుతోంది. మన జిల్లాలో అవసరమైన బూస్టర్ దోసులు అందుబాటులో ఉన్నాయి. మొదటి డోస్ కరోనా టీకాలు వేసుకున్న వారి సెల్‌పోన్లకు బూస్టర్ డోస్ వేసుకోవాలంటూ మెసేజీలు పంపుతున్నాము. ఇలా వచ్చిన మెసేజీ వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది చూపితే చాలు.

ప్రజాశక్తి : కరోనా ఆంక్షలేవైనా ఉన్నాయా?

డిఎంఅండ్‌హెచ్ఒ: వైద్య ఆరోగ్యశాఖ, ప్రభుత్వం నుంచి నేటి వరకు ఎలాంటి ఆంక్షలు లేదు. మాస్క్‌లు ధరించడం, వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచనలు చేస్తున్నాం. అలాగే జర్వంతో ఆసుపత్రులను ఆశ్రయిస్తున్న వారిలో నాలుగైదు రోజులకు మించి జర్వం ఉంటే కరోనా పరీక్షలు నిర్వహిస్తున్నాం.

శ్రీవారి సేవలో ప్రముఖులు

ప్రజాశక్తి -తిరుమల: నూతన సంవత్సరం సందర్భంగా తిరుమల శ్రీవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. జమ్ము కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, రాష్ట్ర డిప్యూటీ సీఎంలు ముత్యాల నాయుడు, నారాయణ స్వామి, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, తమిళనాడు మంత్రి గాంధీ, తెలంగాణ కాంగ్రెస్ నేత భట్టి విక్రమార్క, తాడిపత్రి ఎమ్మెల్యే పెద్దారెడ్డి, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, సినీ నటుడు రాజేంద్రప్రసాద్‌లు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేసి శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

శ్రీవారిని దర్శించుకున్న న్యాయమూర్తులు

నూతన సంవత్సరం సందర్భంగా తిరుమల శ్రీవారిని పలువురు న్యాయమూర్తులు దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రవీంద్ర బాబు, జస్టిస్ రవినాథ్ తిలారి, తెలంగాణ హై కోర్టు న్యాయమూర్తి జస్టిస్ పుల్ల కార్తీక్‌లు స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేసి శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు..

నగరంలో నూతన సంవత్సర వేడుకలు

ఆలయాలకు క్యూకట్టిన ప్రజలు

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలను ఆదివారం నగరంలో ఘనంగా నిర్వహించారు. యువత శనివారం అర్ధరాత్రి వీధుల్లో బాణసంచా కాలుస్తూ కేక్‌లను కట్ చేసి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. నూతన సంవత్సరం సందర్భంగా నగరంలోని చిన్న, పెద్ద ఆలయాలన్నీ శోభాయమానంగా అలంకిరంచారు. కోదండ రామాలయం, కపిలేశ్వర స్వామి ఆలయం, అలిపిరి పాదాల మండపం, గోవిందరాజ స్వామి ఆలయం, శ్రీనివాస మంగాపురంలోని కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం, తుమ్మలగుంట కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం, సంతాన వెంకటెశ్వరస్వామి ఆలయం, తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం, ఇస్కాన్ రాధా గోవింద మందిరాలతోపాటు నగరంలోని సాయిబాబా మందిరాలకు నగరవాసులు దర్శనాల కోసం క్యూకట్టారు.

టాస్క్‌ఫోర్స్‌లో..

తిరుపతి (మంగళం): ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్ ఫోర్స్‌లో ఆదివారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. టాస్క్ ఫోర్స్ ఆర్ఐ సురేష్ కుమార్ రెడ్డి, పోలీసు స్టేషన్ సీఐ చంద్రశేఖర్‌ల అధ్వర్యంలో ఎస్పీ కే.చక్రవర్తి కేక్ కట్ చేశారు. టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ఎస్పీకి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గతేడాదికన్నా ఎక్కువగా శ్రమించి, ఎర్రచందనం వృక్షాలను కాపాడాలన్నారు. అందరూ కలసికట్టుగా కార్యచరణతో స్మగ్లింగ్‌ను నిరోధించాలని తెలిపారు. దుంగలను పట్టుకోవడం కన్నా, చెట్లను నరకకుండా ఉండేలా శ్రమిద్దామని పిలుపునిచ్చారు.

3న శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో..

పీజీ స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి - క్యాంపస్ :

శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో పీజీ స్పాట్ అడ్మిషన్స్ కోసం దరఖాస్తులను 03వ తేదీన ఆహ్వానిస్తోందని కులసచివులు ఆచార్య డి.ఎం.మమత ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంకి నాక్ కమిటీ ఏ గ్రేడ్, అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో స్వర్ణ పథకం సాధించి ఖ్యాతి గడించిదన్నారు. విద్యార్థులకు, మహిళలకు సాంకేతికాభివృద్ధి కోసం అధునాతన పరికరాలు కలిగిన ప్రయోగశాలలు, సరికొత్త ఆవిష్కరణలు పొందడానికి క్రియాశీలక కేంద్రాలను కలిగి వుంది. విద్యార్థినులు ఆన్ క్యాంపస్ డ్రైవ్ ద్వారా ఉద్యోగ అవకాశాలు మెండుగా పొందుతున్నారు. విద్యార్థినులు భద్రత కోసం మహిళా రక్షణ కేంద్రం, మహిళలకు విద్యార్థినులకు హస్త కళాఉత్పత్తుల శిక్షణ కోసం శిక్షణా కేంద్రం కలదు. మాస్టర్ అఫ్ సైన్సెస్‌లో బయోకెమిస్ట్రి, అప్లైడ్మై మైక్రోబయాలజీ, ఇండస్ట్రియల్ మైక్రోబయాలజీ, బయోటెక్నాలజీ, బోటనీ, జూవాలజి, సెరికల్చర్, అప్లైడ్ మాథెమాటిక్స్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్ సైన్సెస్, ఫిజిక్స్, ఆర్గానిక్ కెమిస్ట్రీ, క్లినికల్ సైకాలజీ, స్టాటిస్టిక్స్, హ్యూమన్ డెవలప్మెంట్ అండ్ ఫామిలీ స్టడీస్, మాస్టర్ అఫ్ ఆర్ట్స్‌లో ఇంగ్లీష్, తెలుగు, సోషల్ వర్క్, ఎకనామిక్స్, జెండర్ స్టడీస్, కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం, మ్యూజిక్, భరతనాట్యం, ఎడ్యుకేషన్, ఫిసికల్ ఎడ్యుకేషన్, కామర్స్ కోర్సులకు స్పాట్ అడ్మిషన్ జరుపబడునని, ఏపీ పీజీ సెట్ 2022 లో ర్యాంకులు పొందిన విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అడ్మిషన్స్ డైరెక్టర్ ఆచార్య సువర్ణ లతా దేవి తెలియజేశారు. వివరాల కోసం ఞఞఞ.ంజూఎజజ.ఖఔ.అఆ వెబ్ సైట్‌ని సందర్శించాలన్నారు.

ఒంటిమిట్టలో అన్నప్రసాద వితరణ

ప్రజాశక్తి-తిరుపతి సిటీ:

వైఎస్ఆర్ కడప జిల్లా ఒంటిమిట్టలోని టిటిడికి చెందిన శ్రీకోదండరామ స్వామి ఆలయంలో ఆదివారం అన్నప్రసాద వితరణను టిటిడి ప్రారంభించింది. నూతన వంటశాలలో స్వామి అమ్మవార్ల చిత్రపటాలకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం తదితర వైదిక కార్యక్రమాలు చేపట్టారు. టిటిడి ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతిరోజు మధ్యాహ్నం 12 గంటలకు భక్తులకు అన్న ప్రసాద ప్రసాద వితరణ చేస్తామని అధికారులు తెలిపారు. ఆలయ డెప్యూటీ ఈవో నటేష్ బాబు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

తిరుపతి జిల్లాను అభివృద్ధి పథంలో నడుపుదాం

జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి

ప్రజాశక్తి-తిరుపతిటౌన్: నూతన సంవత్సరంలో తిరుపతి జిల్లాను మరింత అభివృద్ధి పథంలో నడపడానికి అధికారులందరూ కలిసి సమిష్టి కషితో పనిచేద్దామని జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణారెడ్డి పిలుపునిచ్చారు. నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం ఉదయం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జెసి డీకే బాలాజీ, డీఆర్‌వో శ్రీనివాసరావు, ఆర్డీవోలు కనక నరసారెడ్డి, రామారావు, జిల్లా అధికారులు కలెక్టర్ వారిచే కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అధికారులకు సూచిస్తూ తిరుపతి జిల్లాలో పరిశ్రమల స్థాపనకు, ఆక్వా రంగ అభివృద్ధికి అవకాశాలు మెండుగా ఉన్నాయని.. యువతకు ఉపాధి కల్పన లక్ష్యంగా అధికారులందరూ సమిష్టి కృషితో నూతన సంవత్సరంలో జిల్లాను మరింత అభివద్ధి పథంలో ముందుండేలా కషి చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ అభివద్ధి కార్యక్రమాల అమలులో అధికారులు అంకిత భావంతో పనిచేయాలని తెలిపారు. ఈ సందర్భంగా డీఆర్డీఏ పీడీ జ్యోతితో కలిసి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వైయస్సార్ పెన్షన్ కానుక రూ.2,500 నుండి రూ.2,750 లకు పెంచిన వారోత్సవాల గోడపత్రిక ను విడుదల చేశారు. జిల్లాలోని అన్ని శాఖల ఉన్నతాధికారులు జిల్లా కలెక్టర్, జేసీల పిలుపుమేరకు బొకేలకు బదులుగా పెద్ద ఎత్తున నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లతో జిల్లా కలెక్టర్, జేసీలను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి జిల్లా కలెక్టర్ ఒకరికొకరు పరస్పరం నూతన సంవత్సర శుభా కాంక్షలు తెలుపుకున్నారు అనంతరం ఇద్దరు కలసి రాష్ట్ర అటవీ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడి, డిప్యూటీ సీఎం నారాయణ స్వామి లను క్యాంపు కార్యాలయాలలో కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

డిఎస్పీ సూర్యనారాయణ రెడ్డి

ప్రజాశక్తి -గూడూరు : విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని గూడూరు డీఎస్పీ సూర్యనారాయణ రెడ్డి అన్నారు. శనివారం రాత్రి గూడూరు పట్టణంలోని హెచ్‌డీ ఎరీనా ఇండోర్ స్టేడియంలో పట్టణ స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీలను ది యంగ్ గూడూర్ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోలాహల వాతావరణంలో నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ, ప్రయివేటు స్కూళ్లకు చెందిన 160 జట్లు పాల్గొన్నాయి. విద్యార్థులతో స్టేడియం కిక్కిరిసిపోయింది. ఉదయం నుండి రాత్రి వరకూ పోటీలు హోరాహోరీగా సాగాయి. రాత్రి ఏర్పాటు చేసిన సదస్సులో డీఎస్పీ సూర్యనారాయణ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు విద్యార్థులను క్రీడలపై ఆసక్తి పెంచేలా కృషి చేయాలన్నారు. ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు క్రీడలు దోహదపడుతాయన్నారు. పోటీలు నిర్వహించిన వైజీఎస్బీఏ, ఆతిథ్యం ఇచ్చిన ఇండోర్ స్టేడియం నిర్వాహకులను అభినందించారు. ఏదైనా జీవించి సాధించాలే తప్ప క్షణికావేశంలో తీసుకున్న అనాలోచిత నిర్ణయాలతో అమూల్యమైన జీవితం కోల్పోతారన్నారు. వైజీఎస్బీఏ గౌరవాధ్యక్షులు, వైసీపీ సీనియర్ నాయకులు చేవూరు విజయ్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో క్రీడాభివృద్ధికి అసోసియేషన్ నిరంతరం కృషి చేస్తూనే ఉందన్నారు. ఇంటర్ స్కూల్ క్రీడా పోటీల నిర్వహణ ప్రధాన ఉద్దేశ్యం పేద క్రీడాకారులను గుర్తించి ప్రత్యేక శిక్షణ ఇచ్చి జాతీయ స్థాయిలో రాణించేలా చర్యలు తీసుకోనున్నట్లు సభికుల కరతాళ ధ్వనుల నడుమ ప్రకటించారు. శ్రీచైతన్య స్కూల్ ప్రిన్సిపల్ కోట శ్రీనివాసులు మాట్లాడుతూ పెద్ద పెద్ద నగరాలకు ధీటుగా గూడూరులో ఇండోర్ స్టేడియం క్రీడాకారులకు అంకితం చేసిన హర్ష దీపుల సేవలను కొనియాడారు. క్రీడాపోటీలను చక్కగా నిర్వహించిన వైజీఎస్బీఏ సభ్యులను అభినందించారు. ఎస్ఐ పవన్ మాట్లాడుతూ గూడూరు క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని తెలిపారు. గేమ్‌లు ఫోన్లలో కాకుండా మైదానంలో ఆడితే శారీరక దారుఢ్యం కలుగుతుందన్నారు. ది యంగ్ గూడూర్ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు షేక్.జమాలుల్లా మాట్లాడుతూ 160 జట్లతో షటిల్ క్రీడా పోటీలు నిర్వహించి చరిత్ర సృష్టించామన్నారు. 11ఏళ్ల క్రితం వైజీఎస్బీఏ ఏర్పాటు చేసి పట్టణంలో షటిల్ క్రీడాభివృద్ధిలో భాగంగా ప్రతి ఏడాది జాతీయ స్థాయి క్రీడా పోటీల నిర్వహణ, ఉచిత సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నామన్నారు. ఇంటర్ స్కూల్స్ ఛాంపియన్ షిప్ పోటీలకు సహకరించిన అన్ని స్కూళ్ల ప్రిన్సిపల్స్, పీఈటీలకు, వైజీఎస్బీఏ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విజేతలకు షీల్డులు, మెమెంటోలు ప్రదానం చేశారు. పదవ తరగతి బాలుర విభాగంలో సీఎస్ఎం స్కూల్ షేక్. బీ.అద్నాన్ జట్టు, బాలికల విభాగంలో ప్రాస్‌పరో స్కూల్ షేక్. అంషద్ ఫర్వీన్, లక్ష్మీ ప్రియ జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. అలాగే శ్రీచైతన్య, సీఎస్ఎం, ఎల్‌పీపీ, జెడ్పీ బాలుర, బాలికల విభాగాలలో 5, 6, 7, 8, 9 తరగతుల విద్యార్థులు విన్నర్స్, రన్నర్స్‌గా నిలిచారు. డీఎస్పీ, అతిథుల చేతులమీదుగా షీల్డులు, మెమెంటోలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైజీఎస్బీఏ గౌరవాధ్యక్షులు చేవూరు విజయ్ మోహన్ రెడ్డి, శ్రీచైతన్య ప్రిన్సిపల్ కోట శ్రీనివాసులు, అధ్యక్షులు షేక్. జమాలుల్లా, ఉపాధ్యక్షులు అబ్దుల్ కలాం, ప్రధాన కార్యదర్శి జీ. గిరిబాబు, ఎస్ఐ పవన్, హర్షవర్ధన్ రెడ్డి, నాగేంద్ర రెడ్డి, కోదండపాణి, మల్లి కార్జున్ రావు, పీఈటీలు సుబ్రమణ్యాం, శివ కుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేను పట్టించుకోరా?

టిటిడి తీరుపై మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ఫైర్

ప్రజాశక్తి-తిరుపతి సిటీ:

వైకుంఠ ద్వారా దర్శనం కోసం ఓ మాజీ శాసనసభ్యురాలిగా సిఫార్సు లేఖను పంపితే టిటిడి అధికారులు పట్టించుకోకపోవడంపై తిరుపతి మాజీ శాసనసభ్యురాలు సుగుణమ్మ ఫైర్ అయ్యారు. ఆదివారం తిరుపతి రామచంద్ర పుష్కరిణి వద్దనున్న టికెట్ కౌంటర్‌లో క్యూలో నిలబడి ఏకాదశి టికెట్టును తీసుకున్నారు. ఈ సందర్భంగా సుగుణమ్మ మాట్లాడుతూ ఎమ్మెల్యేగా ప్రజల మద్దత్తుతో నైతిక విజయం సాదించానని, ఈ విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలన్నారు. గత ప్రభుత్వ హాయంలో ఏ ఒక్కరికి లోటు లేకుండా సమ ప్రాదాన్యత ఇచ్చామని గర్తు చేశారు. అధికార పార్టిలో ఉన్న చిన్న చోట నాయకులకు, విఐపిలకు ముందుగానే టిక్కెట్లను ఇస్తున్నారని, ఓ మాజీ స్థానిక శాసనసభ్యురాలిగా వెంకటేశ్వర స్వామిని దర్శించుకునే అర్హత లేదా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం, టిటిడి సామాన్య భక్తులకు సేవ చేయడానికా లేక విఐపిలకు సేవ చేయడానికి ఉన్నారా అని ప్రశ్నించారు. ఆదివారం తిరుపతికి 16 మంది ప్రత్యేక విమానాల్లో వచ్చారని, వారికి పాసులు మంజూరు చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే లేఖను చులకనగా చూడటం భాదకలిగిస్తోందన్నారు.

యూటీఎఫ్ డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: నూతన డైరీ, కాలమాన పట్టికను ఆదివారం తిరుపతి శాసనసభ్యులు కరుణాకర్ రెడ్డి వారి స్వగహంలో ఆవిష్కరించారు. మొదటగా తిరుపతి యూటీఎఫ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నాయకులు బండి మధుసూదనరెడ్డి, రెడ్డప్పరెడ్డి, వై హేమాద్రి బాబు, భాష, వి ప్రభుకుమార్ తదితరులు కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు ఎమ్మెల్యేకి తెలియజేశారు. అనంతరం నాయకులు ఎమ్మెల్యే. భూమన కరుణాకర్ రెడ్డిని సత్కరించారు.

స్విమ్స్ డైరెక్టర్ వెంగమ్మకు కార్మికుల కృతజ్ఞతలు



ప్రజాశక్తి- తిరుపతి టౌన్: నూతన సంవత్సర ప్రారంభంలో స్విమ్స్ లో పనిచేస్తున్న కార్మికులందరికీ వేతనాలు పెంచడంలోను, లక్ష్మీ శ్రీనివాస కార్పొరేషన్‌లో విలీనం చేయడంలోనూ కీలక ప్రయత్నం చేసిన స్విమ్స్ డైరెక్టర్ భూమా వెంగమ్మకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి కందారపు మురళి నేతత్వంలో స్విమ్స్ కాంట్రాక్ట్ కార్మికులు ఆదివారం ఉదయం ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులకు సౌకర్యాలు పెంచడంలో తోడ్పడిన వెంగమ్మకు కందారపు మురళి అభినందనలు తెలిపారు. టిటిడి ఈవో ధర్మారెడ్డి తో మాట్లాడి కార్మికులకు మరిన్ని ప్రయోజనాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అభినందనలు తెలియజేసిన కార్మికులందరికీ వెంగమ్మ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. స్విమ్స్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు సుబ్రహ్మణ్యం, కార్యదర్శి రవి, రామకష్ణ, సూరి, విజయలక్ష్మి నాగమణి తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

అధికారులకు ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు

తిరుపతి టౌన్: నూతన ఆంగ్ల సంవత్సరం సందర్భంగా నగర ప్రముఖులు.నగరపాలక మేయర్ డాక్టర్ శిరీషకు శుభాకాంక్షలు తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయం మేయర్ ఛాంబర్‌లో ఉప మేయర్, ముద్ర నారాయణ కార్పొరేటర్లు, నగర పాలక అధికారులు తిరుపతి, అర్బన్ తహసీల్దారు వెంకటరమణ, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్ మున్సిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, ఎంఈలు చంద్రశేఖర్, వెంకటరామిరెడ్డి, డీఈలు విజయకుమార్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, దేవిక, గోమతి, సంజయ్ కుమార్, మహేష్, పుత్తూరు డీఈ చంద్రశేఖర్‌రెడ్డి, తిరుపతి పబ్లిక్ హెల్త్ డి కరుణాకర్ రెడ్డి టౌన్ ప్లానింగ్ డీసీపీ దేవికకుమారి, ఏసీపీలు బాలసుబ్రహ్మణ్యం, షణ్ముగం, టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, ఉపాధ్యాయులు, నగర ప్రముఖులు, వైసీపీ నాయకులు ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గొల్లపల్లి విద్యార్థులు

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైన గొల్లపల్లి విద్యార్థులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండలం గొల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రథమ ఉపాధ్యాయులు భారతి తెలిపారు. స్థానిక ఉన్నత పాఠశాలలో జరిగిన ఎస్‌జిఎఫ్ జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి అండర్- 17, బాలుర విభాగంలో పవన్ ప్రశాంత్ నవీన్, అండర్ -17 దీపిక, మానికలోచిని, అండర్- 14. బాలుర విభాగంలో రాజా, వరుణ్, అండర్-14, బాలిక విభాగంలో ఉదయశ్రీ, ఆర్తి, మౌనిక ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 11, 12, 13న నెల్లూరు జిల్లా ఆత్మకూరులో జరుగు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పీడీ గోపికృష్ణ తెలిపారు. ఈ ఎంపిక పట్ల ఉపాధ్యాయులు ఉపాధ్యాయుల బృందం, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

పలు గ్రామాలకు ఆర్టీసీ బస్సు ఏర్పాటు

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: మండలంలోని విఠల్ అగ్రహారం, బోడేవాళ్లపల్లి పంచాయతీలలో పలు గ్రామాలకు రోడ్డు ఉన్నప్పటికీ ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజల విజ్ఞప్తి మేరకు విఠల్ అగ్రహారం పంచాయతీ సర్పంచ్ సదాశివం వెంకటరమణారెడ్డి చొరవతో ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించారు. తిరుపతి నుండి ఎల్లమందపైగా సుండుపల్లికి వెళుతున్న ఆర్టీసీ బస్సు రెండు పంచాయతీల్లో పలు గ్రామాలను కలుపుకొని ప్రజల సౌకర్యార్థం వెళ్లాలన్నారు. గతంలో ప్రజలు కోరుకోవడంతో నేటి నుంచి గ్రామాల్లో ప్రజలకు సౌకర్యంగా సుండుపల్లి బస్సు నడవడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

తహశీల్దార్ మధుసూదన్ రావుకు సన్మానం

ప్రజాశక్తి- పిచ్చాటూరు : ఆదివారం కొత్త సంవత్సరం శుభాకాంక్షలు పిచ్చాటూరు మండలం తహశీల్దార్ మధుసూదన్ రావును రెవెన్యూ సిబ్బంది, వీఆర్వోలు క్షేత్ర సహాయకులు ఘనంగా సన్మానించి కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. తహశీల్దార్ మధుసూదన్‌రావు మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో రెవెన్యూ సిబ్బందితో అందరం కలిసి కార్యాలయంలో కేక్ కట్ చేసి సంతోషాన్ని పంచుకుందామని అలాగే మండలంలోని ప్రజలందరికీ మంచి జరగాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. నూతన సంవత్సరాలు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగనీయకుండా రెవెన్యూ పనులు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిటి వెంకటేశులు, వీఆర్వోలు దేవరాజ్, వెంకటేశులు, ప్రియాంక, భాష, సెల్వం, వీఆర్ఏలు, ధనవేలు, వెంకటేశులు, రవి, శరవణ, రామదాసు, సుజాత, ఈశ్వర్, మొదలగు వారు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి నివాళి

ప్రజాశక్తి - రేణిగుంట: నూతన సంవత్సరం సందర్భంగా రేణిగుంట సీనియర్ సిటిజన్స్ వారి ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని రేణిగుంట గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రేణిగుంట పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ నగేషమ్మ, వైకాపా కార్యాలయంలో ఎంపీపీ హరిప్రసాద్ రెడ్డిని, జెడ్పీటిసి సంధ్యాని కలిసి శాలువాతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. తహశీల్దార్ మధుసూదన్ రెడ్డి తనయులు పవిత్ర రెడ్డి జన్మదినం సందర్భంగా రేణిగుంటలో ఆమెను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా ఆసా సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు తిరుపతి పార్లమెంట్ సభ్యులు గురుమూర్తిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేంద్ర, హసన్ సాహెబ్, అప్పారెడ్డి, వెంకటేశ్వర్లు, రంగయ్య, రవి, భాష, తిమ్మారెడ్డి, షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

పవిత్రమ్మ పుట్టినరోజు వేడుకలు

పెంచిన పెన్షన్లను పంపిణీ చేస్తున్న వైస్ ఛైర్మన్ డి.జయ ప్రకాష్

ప్రజాశక్తి - రేణిగుంట : పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో ఆదివారం రేణిగుంట వైసీపీ ఇన్‌ఛార్జి పవిత్రమ్మ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రేణిగుంట బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు ఆమెను శాలువతో సన్మానించి పుష్పగుచ్ఛాన్ని అందించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు రామ్మోహన్, ఉపాధ్యక్షుడు ప్రకాష్, సెక్రటరీ, శివ కార్యవర్గ సభ్యులు అశోక్, ఉమా, పవన్, రాజులక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

ప్రజాశక్తి-రొంపిచెర్ల: ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలను అర్హులందరికీ అందించాలని డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి (డీఎల్‌డీఓ) రవికుమార్ తెలిపారు. రొంపిచెర్ల మండలంలోని గ్రామ సచివాలయాలను శనివారం రవికుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ రికార్డులు, సిబ్బంది హాజరు రిజిస్టర్, ప్రజా ఫిర్యాదుల రిజిస్టర్ తదితర రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ఉన్నత ఆశయంతో సచివాలయ వ్యవస్థను అమలుచేస్తోందని, ప్రజలకు అందించే మెరుగైన సేవలకు సచివాలయాలు వేదికలు కావాలన్నారు. ప్రజా ఫిర్యాదులను నిబంధనల మేరకు వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్ర, రవిచంద్రబాబు, డిజిటల్ అసిస్టెంట్, మహిళా పోలీసు, వలంటీర్లు పాల్గొన్నారు.

భయం భయంగా విధులు!

- పెచ్చులూడుతున్న శ్లాబ్
- శిథిలావస్థలో తహశీల్దార్ కార్యాలయం
- ఉరుస్తున్న గదులు..తడుస్తున్న రికార్డులు

ప్రజాశక్తి -బాలాయపల్లి : ఎప్పుడు కూలుతుందోనని తిరుపతి జిల్లా బాలాయపల్లి తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది భయం భయంగా విధులు నిర్వహిస్తున్న సంఘటన నెలకొని ఉంది. భవనం శిథిలావస్థకు చేరడంతో పెచ్చులూడి పడుతుండడంతో సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. ఈ భవనం 2003లో భవనం నిర్మించారు. నాటి నుంచి నేటి వరకు దాని నిర్వహణను పట్టించుకోక పోవడంతో 19 ఏళ్ళు శిదిలావస్థకు చేరింది. అక్కడక్కడ పెచ్చులూడి పడుతోంది. విధులు నిర్వహిస్తున్న సిబంది ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని విధులు నిర్వహిస్తున్నారు. ఇక మండల కార్యాలయానికి వివిధ పనులపై వచ్చే ప్రజలు ఎక్కడ తమపై పెచ్చులూడి పడుతామని భయందోళన చెందుతున్నారు.

శిథిలావస్థలో తహశీల్దార్ కార్యాలయం

అరచేతిలో ప్రాణాలు :
తహశీల్దారు కార్యాలయం స్లాబ్, పిల్లర్‌లు పెచ్చులూడి బయట పడడంతో ఎక్కడ కూలుతోందనని అరచేతిలో ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని విధులు నిర్వహించాల్సిన పరిస్థితి ఉందని సిబ్బంది చెబుతున్నారు. అక్కడక్కడ శ్లాబ్ పెచ్చులూడి పడుతు న్నాయి. ప్రతి రోజు ప్రమాదంలో రెవెన్యూ సిబ్బంది పనిచేయాల్సి వుంది.

పగిలిన పిల్లర్

పట్టించుకునే వారు కరువయ్యారు:
తహశీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో శ్లాబ్ పెచ్చులూడుతున్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోలేదు. చినుకుపడితే ఆ నీళ్ళు గదుల్లో ఉంటాయి. ఇక వర్షాకాలం వస్తే ఆ సమయంలో విధుల నిర్వహణ కష్టమే. డిప్యూటీ తహశీల్దార్ గదిలో కంప్యూటర్, రెవెన్యూ సిబ్బంది ఉండే గది, సర్వేయర్ గది, ఆర్ఐ గది అస్తవ్యస్తంగా మారాయి. ఇక రికార్డులు భద్రపరిచే గది పరిస్థితి చెప్పనక్కర్లేదు. రికార్డులు తడిసి పోతున్నాయని సిబ్బంది వాపోతున్నారు. వర్షాలు తగ్గిన వెంటనే రికార్డులను ఎండలో ఆరబెట్టిన సందర్భాలు అనేకం. ఇదిలా వుంటే, కార్యాలయ భవనాల శ్లాబ్‌లు బీటలు వారడంతో పెచ్చులూడి పడుతులన్నాయి. దీంతో సిబ్బంది భయం భయంగా విధులు నిర్వహించాల్సి వస్తోంది. వర్షాల సమయాల్లో భవనం ఎక్కడ కూలిపోతుందోనని భయపడినట్టు సిబ్బంది చెపుతున్నారు. రికార్డు గది పూర్తిగా శిథిలమైంది. ఆ గదిలో పంచాయితీలకు సంబంధించిన దస్త్రాలను భద్రపరిచారు. పాత అడంగళ్, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలకు సంబంధించి దస్త్రాలు ఇందులోనే ఉన్నాయి. వర్షాల సమయాల్లో అవి నానిపోతున్నాయని సిబ్బంది వాపోతున్నారు.

శిథిలావస్థకు చేరింది:
భవనం మొత్తం ఉరుస్తుంది. వర్షం వస్తే పక్కనే ఉన్న సచివాల యంలో తలదాచు కోవాల్సి వస్తుంది. ఈ విషయంపై తహ శీల్దార్ అజ్మీత్తుల్లఖాన్‌ను వివరణ కోరగా విషయం జిల్లా అధి కారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.

పెచ్చులూడుతున్న శ్లాబ్

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు


శ్రీకాళహస్తిలో..

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: న్యూ ఇయర్ వేడుకలు ఆదివారం పట్టణంలో ఘనంగా జరిగాయి. శనివారం అర్ధరాత్రి నుంచి యువత కేరింతల నడుమ కొత్త ఏడాది సంబరాలు మొదలైపోయాయి. పెద్ద ఎత్తున కేకులు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. శుభాకాంక్షలు తెలుపు కున్నారు. స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మసూదన్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఆదివారం న్యూఇయర్ వేడుకలు నిర్వహించారు. పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు, పాత్రికేయులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడుకి, బిజెపి రాష్ట్ర మీడియా ప్రతినిధి కోలా ఆనంద్‌కు, ఆలయ పాలక మండలి ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులకు, వైసిపి బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు మిద్దెల హరికి కూడా పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు న్యూఇయర్ శుభాకాంక్షలు తెలియజేశారు.

పుత్తూరు టౌన్ : నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరికీ అభివృద్ధి, విజయాలతో పాటు సుఖ సంతోషాలు కలగాలని టీడీపీ జిల్లా మాజీ అధికార ప్రతినిధి పోతుగుంట విజయబాబు ఆకాంక్షించారు. ఆదివారం నూతన సంవత్సరం తొలిరోజు పురస్కరించుకుని పట్టణంలోని టీబీ రోడ్డులో ఉన్న ఆయన కార్యాలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత అభివృద్ధితో పాటు సమాజ అభివృద్ధి పట్ల దృష్టి సారించాలని సూచించారు. సమస్యలను తన దృష్టికి తీసుకు వస్తే పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం విజయబాబుని దుశ్శాలువ, పూల దండలతో ఘనంగా సన్మానించారు.రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి రవి నాయుడు, మాజీ ఎంపిటిసి జి.దనపాల్, కెవిఎస్‌కె స్టేట్ డైరెక్టర్ సుమన్ నాయుడు, టీఎన్‌టీయూసి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఆరవ ప్రకాష్, చంద్రా యాదవ్,

పోతుగుంట విజయబాబును సత్కరిస్తున్న అభిమానులు

గూడూరు సీపీఎం కార్యాలయంలో..

జెకె మేఘనాధ్ జలకం నవీన్, వంశీ, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు చిదా, పయనిర్ మిల్లు కార్మికులు పాల్గొన్నారు.

సీపీఎం కార్యాలయంలో..
గూడూరు:గూడూరు రెండవ పట్టణ పరిధిలోని రెండవ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్ ఆధ్వర్యంలో ఆదివారం సిపిఎం కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. పార్టీ నాయకులకు పట్టణ ప్రజలకు రైతులకు, కార్మికులకు, ఈ సంవత్సరం అందరికీ జీవితాలతో సంతోషం, ఆరోగ్యం, ఐశ్వర్యంతో ఆనందంగా సాగిపోవాలని శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రైతు సంఘం నాయకులు ఏ.చంద్రయ్య ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు పట్టణ కార్యదర్శి పి.మణి, కె.వి.పి.ఎస్. నాయకులు అడపాల. ప్రసాద్, జిల్లా ఆటో కార్మిక సంఘం నాయకులు బి.వి.రమణయ్య, సురేష్, సుబ్బయ్య ,రాజ, బి.చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

పేదల సేవే మా పరమార్థం : కలవగుంట భరత్ రెడ్డి

ప్రజాశక్తి -తొట్టంబేడు: పేదల సేవే తమ పరమార్ధమని జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ రాష్ట్ర డిప్యూటీ ఛైర్మన్ వెలంపాటి కోటేశ్వర బాబు, ప్రధాన కార్యదర్శి కలవగుంట భరత్ రెడ్డి చెప్పారు. నూతన సంవత్సరం పురస్కరించుకుని ఆదివారం తొట్టంబేడు మండలం పిల్లమేడు, మామిడిగుంట గిరిజనకాలనీల్లో జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలవగుంట భరత్ రెడ్డి ఆధ్వర్యంలో గిరిజనులకు దుప్పట్లు, పండ్లు, మిఠాయిలు పంచి పెట్టారు. ఈ సందర్భంగా కోటేశ్వరబాబు, కలవగుంట భరత్ రెడ్డి మాట్లాడుతూ... జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ వినియోగదారుల హక్కులను కాపాడటానికి పని చేస్తోందన్నారు. వినియోగదారులకు ఎవరైనా అన్యాయం చేస్తే తమ కమిషన్‌కు తెలియజేయాలని వారు కోరారు. తాము ఈ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేస్తామన్నారు. తాము వినియోగదారుల హక్కుల కోసమే కాకుండా ఈ కమిషన్ ద్వారా పేదలకు సేవ చేయాలని కూడా నిర్ణయించుకున్నట్లు వారు చెప్పారు. పేదలకు సేవ చేయడానికి ఇదో మంచి వేదిక అని వారు అభిప్రాయపడ్డారు. పేదలకు ఏ కష్టం వచ్చినా వారికి అండగా ఉంటామని వారు భరోసా ఇచ్చారు. ప్రార్థించే పెదవులు కన్నా సాయం చేసే చేతులు మిన్న అని పెద్దలు చెప్పారని... అందుకే తాము పేదలకు సేవ చేస్తున్నట్లు వారు చెప్పారు. పేదలకు సేవ చేయడంలో ఎంతో సంతృప్తి ఉందన్నారు. పేదలకు మరిన్ని సేవలు అందించి అందరికీ ఆదర్శంగా ఉండాలన్నదే తమ అభిమతం అన్నారు. అనంతరం ఎన్‌సీఆర్‌సీపై పిల్లమేడు, మామిడిగుంట గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గురవయ్య, భాస్కర్, ధనుంజయ్, మహేష్ నాయుడు, సురేష్, బాబు, మణికంఠ, రామయ్య, శ్రీను, కాటయ్య, రాఘవయ్య, సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనరసింహస్వామి సేవలో పెద్దిరెడ్డి

ప్రజాశక్తి-పులిచెర్ల: రాష్ట్ర విద్యుత్తు, అటవీ, భూగర్భగనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రాజంపేట, చిత్తూరు ఎంపీలు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, రెడ్డెప్పలు ఆదివారం దేవలంపేట శ్రీ లక్ష్మి నరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన మంత్రి పెద్దిరెడ్డి, మిథున్ రెడ్డి, రెడ్డెప్పకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించిన మంత్రి పెద్దిరెడ్డి మొక్కులు తీర్చున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నూతన సంవత్సర కేక్ ను కట్ చేసిన మంత్రి పెద్దిరెడ్డి మండలంలోని ప్రజా ప్రతినిధులకు, అభిమానులకు పంచిపెట్టారు. మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ లు మిథున్ రెడ్డి, రెడ్డెప్పలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-రొంపిచెర్ల : రాష్ట్ర అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా ఆదివారం ప్రజాశక్తి నూతన సంవత్సర క్యాలెండర్ ను తలకోన సిద్దేశ్వర స్వామి సన్నిధిలో ఘనంగా ఆవిష్కరించారు. అలాగే రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ ప్రజాశక్తి దినపత్రిక పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఎనలేని కషి చేస్తుందని కొనియాడారు.

తలకోనలో మంత్రి పెద్దిరెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి

ప్రజాశక్తి-యర్రావారిపాలెం : నూతన సంవత్సరం పురస్కరించుకొని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ తలకోన సిద్దేశ్వర స్వామి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కొత్త సంవత్సరం పరిష్కరించుకొని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి, చంద్రగిరి శాసనసభ్యులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, ఎంఆర్‌సి రెడ్డి, మోహిత్ రెడ్డి, ఆదివారం ఉదయాన్నే తలకోనకు విచ్చేశారు. అనంతరం మండల వైసీపీ నాయకులు వీరికి పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. దర్శనార్థం వచ్చిన భక్తులను రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్ర రెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఆప్యాయంగా పలకరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే చెవిరెడ్డి నెరబైలు పంచాయతీలో పెంచిన పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ నాయకులు చెంగల్రెడ్డి, రెడ్డప్ప రెడ్డి, నాగార్జున రెడ్డి, హరినాథ్ రెడ్డి, ఎంపీపీ శివలక్ష్మి, జెడ్పిటిసి కరుణాకర్ రెడ్డి, తలుకొన ఛైర్మన్ ఉమామహేశ్వర్ రెడ్డి, బాబి, ఈవో జయకుమార్, వెంకటరమణారెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వాహనాలు జాగ్రత్తగా నడపాలి : ఆలయ ఛైర్మన్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నూతన సంవత్సరం సందర్భంగా సదాశివా కోనకు విచ్చేయు పుత్తూరు, వడమాలపేట మండలాల భక్తులు, సందర్శకులు తమ వాహనాలను ప్రమాదాలకు గురి కాకుండా జాగ్రత్తగా నడపాలని సదాశివకోన ఆలయ ఛైర్మన్ జయచంద్రన్ తెలిపారు. ఈ సందర్భంగా భక్తులకు, సందర్శకులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ సాయంత్రం5 గంటల తరువాత సదాశివాకోన వాటర్ ఫాల్స్‌కు వెళ్ళడం నిషిద్ధమని, సదాశివా కోనలో మద్యం తాగరాదని, విరుద్ధంగా ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలకు లోను కాకుండా పై సూచనలను ప్రతి ఒక్కరు విధిగా పాటించాలన్నారు. అదేవిధంగా భక్తులు, సందర్శకులు ఇకమీదట ఎటువంటి భయం లేకుండా సదాశివ కోనకు రావచ్చన్నారు. ముఖ్యంగా మహిళలు సంతానం లేని వాళ్ళు మహశివరాత్రి రోజు సదాశివేశ్వర స్వామి దగ్గర తమ కోరికలు చెప్పుకుంటే కచ్చితంగా నేరవేరుతుందన్నారు. పుత్తూరు, వడమాలపేట సిఐ, ఎస్.ఐ ఆధ్వర్యంలో సదాశివకోనలో జాగ్రత్తలు పాటించాలని, ఎటువంటి హానికరమైన పదార్థాలు తీసుకుని రావద్దన్నారు.

పెంచిన పింఛన్లు పంపిణీ చేసిన అధికారులు

పెంచిన పెన్షన్లను పంపిణీ చేస్తున్న కమిషనర్, మున్సిపల్ ఛైర్మన్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి హామీ మేరకు ఈ నెల నుండి మరో రూ.250 పెన్షన్ పెరగడంతో పుత్తూరు పట్టణ గ్రామీణ పరిధిలో వైయస్సార్ పెన్షన్ కానుక సంబరాలను వాడవాడలా ఘనంగా నిర్వహించారు. ఆదివారం నూతన సంవత్సరంలో ప్రభుత్వం పెంచిన పెన్షన్ కానుక సంబరాలు వేకువజాము నుంచే ప్రారంభమయ్యాయి. పురపాలక సంఘంలో ఛైర్మన్ గెడ్డం ఆనంగి హరి కమిషనర్ కేవీఎన్ రెడ్డి, వైసీపీ నాయకుల ఆధ్వర్యంలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అదే విధంగా మండల పరిధిలోని 3వ వార్డ్, 6వ వార్డ్ ఎనిమిదవ వార్డులలో పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 13 సచివాలయాల్లో ప్రతి సచివాలయానికి ముగ్గురు కన్వీనర్లు కలిసి వాలంటీర్లు కలిసి పెన్షన్లు అందజేశారు. అలాగే పట్టణంలోని పలు ప్రాంతాలలో ఆయా వార్డు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

పుత్తూరు టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పెన్షన్ పథకాన్ని నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని రూ.2750 పెన్షన్‌ను 14వ వార్డు సచివాలయం పరిధిలో, వార్డు కౌన్సిలర్ వైస్ ఛైర్మన్, డి.జయప్రకాష్, చేతుల మీదుగా ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డి.జయ ప్రకాష్ మాట్లాడుతూ మన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గతంలో చెప్పిన మాట ప్రకారం రూ.3000లు వరకు పెన్షన్లు ఇస్తామని హామీ ఇచ్చిన ప్రకారం కంతులు వారీగా ఇప్పుడు రూ.2750లు వరకు పెంచాలని వచ్చే సంవత్సరం రూ.3000 ఇస్తారని తెలిపారు. మంత్రి ఆర్కే రోజా కృషితో నగిరి నియోజకవర్గంలో అనేక సంక్షేమాలు పేదలకు చెందే విధంగా అందులో భాగంగా తాము చేపడుతున్నామని అన్నారు. టిడిపి నాయకులు, ఓర్వ లేకుండా పెన్షన్లు తొలగించారని చెబుతున్నారు. నిజమైన లబ్ధిదారులకు అందే విధంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేస్తున్నారని బాగా డబ్బున్న వారు కూడా పెన్షన్లు పొందుతున్నారని వాటిని తొలగించి నిజమైన లబ్ధిదారులకు అందే విధంగా చేపడు తున్నారని అన్నారు. సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది, వాలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

వ్యక్తి దారుణ హత్య

ప్రజాశక్తి-నాయుడుపేట: మండలంలోని మర్లపల్లికి చెందిన వెంకటేష్ అనే వ్యక్తిని అర్ధ రాత్రి పట్టణమంతా నూతన సంవత్సర సంబరాలలో ఉండగా తోటి స్నేహితులే విచక్షణా రాహిత్యంగా పొడిచి చంపిన ఘటన నాయుడుపేట పట్టణంలోని పోగొట్టం కాలనీలో జరిగింది. కొత్త సంవత్సరం సంబరాలలో ఉన్న పట్టణ ప్రజలు ఈ సంఘటనతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. కొంత కాలంగా మృతుడు పొగగొట్టం కాలనీలో నివాసం ఉంటున్నట్లు సమాచారం చుట్టుపక్కల వారు చెప్పుకొచ్చారు. గతంలో ఆటో తోలుతూ జీవనం సాగిస్తున్న వెంకటేశ్వర్లు ప్రస్తుతం మెకానిక్ షెడ్డు నడుపుతున్నట్లు సమాచారం. రాత్రి పన్నెండు గంటల తర్వాత ఈ సంఘటన జరిగిందన్నారు. గుండె దగ్గర 11 కత్తిపోట్లు ఉండగా, గొంతు కోసి మరీ హత్య చేశారు. వివాహేతర సంబంధాలే హత్యకు దారి తీసిఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘాతుకానికి పాల్పడ్డ వారిలో ముగ్గురు దొరికారని, మరో ఇద్దరు పరారీలో ఉన్నారని నాయుడుపేట పట్టణ సీఐ ప్రభాకర్ రావు వివరించారు. ఆయన ఘటనా స్థలాన్ని పరిశీలించి మృత దేహాన్ని నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

ట్రాక్టర్ బోల్తా వ్యక్తి మృతి

ప్రజాశక్తి-యర్రావారిపాలెం:మండలంలోని చింతగుంట పంచాయతీ చిన్నబయలు పచ్చారవాండ్లపల్లి దగ్గర కన్నయ్య(40) అనే రైతు పొలం దగ్గర మహేంద్ర ట్రాక్టర్‌తో పొలం పనులు చేసుకొని తిరిగి ఇంటికి వెళుతుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తాపడటంతో కన్నయ్య అక్కడికక్కడే మృతి చెందారు. నూతన సంవత్సరం రోజున ఈ దుర్ఘటన జరగడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

అంగన్‌వాడీ ఉద్యోగాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి -తొట్టంబేడు: మండల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఉద్యోగాలకు ఈ నెల 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో ఫర్జానా కోరారు. ఈ మేరకు ఆమె ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తొట్టంబేడు ప్రాజెక్టు పరిధిలో తొట్టంబేడు, కేవీబీపురం, బుచ్చినాయుడుకండ్రిగ మండలాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు నాలుగు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు మూడు, అగన్ వాడీ హెల్పర్ 20 పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆమె తెలిపారు. తొట్టంబేడు మండల పరిధిలో శివనాథపురం, విరూపాక్షపురం, పెద్దకన్నలిలో అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులు.. విరూపాక్షపురం యానాదికాలనీలో మినీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు... పెద్ద సింగమాల, రౌతు సూరమాల, సి.కొత్తకండ్రిగ, కొణతనేరి, చిలకావారికండ్రిగ, గుండేలి గుంట, కాసరం. కొమ్మనగుంట గ్రామాల్లో అంగనఖ వాడీ హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులైన వారు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఫర్జానా కోరారు.

పాకాల: మండలంలోని పులిచర్ల ప్రాజెక్టు పాకాల మండలంలోని ఇరంగారిపల్లి పంచాయతీ ఇరంగారి పల్లి అంగన్‌వాడి కార్యకర్త పోస్టుకు, గానుగపెంట పంచాయతీలోని కూనపల్లి అంగన్‌వాడి సహాయకురాల పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పులిచెర్ల ప్రాజెక్టు ఆఫీసర్ నాగశైలజ (పిడి) ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్త, సహాయకురాలు దరఖాస్తు చేసుకునేవారు స్థానికురాలై ఉండాలని, పదో తరగతి ఉత్తీర్ణత అయి ఉండాలన్నారు. 01/07/2022 నాటికి 21 సంవత్సరాలు పూర్తయ్ ఉండాలని 35 సంవత్సరాలలోపు ఉండాలని అన్నారు. జనరల్ కేటగిరి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. దరఖాస్తులను 02/01/2023 నుండి 07/01/2023 వరకు సాయంత్రం ఐదు గంటలలోపు పులిచెర్ల పిసిడిఎస్ కార్యాలయంలో సంప్రదించవచ్చునని వి.రమాదేవి సూపర్వైజర్ తెలిపారు.
తదితరులు పాల్గొన్నారు.

ఉమాదేవి ఆస్పత్రి ప్రారంభం

ప్రజాశక్తి-కార్వేటినగరం: కార్వేటినగరంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఉమాదేవి మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు, డాక్టర్ హరిబాబు కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్యం అందించడానికి కషి చేయాలన్నారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ కార్వేటినగరంలో ఎంబీబీఎస్ అర్హత ఉన్న వైద్యులు అందుబాటులో లేకుండా పుత్తూరు, తిరుపతికి వెళ్లాల్సి వస్తుందని, ఇబ్బందులు లేకుండా గ్రామీణ ప్రాంతంలో మల్టీస్పెషాలిటీ వైద్య సౌకర్యాన్ని అందుబాటులో తీసుకొచ్చారని, నాణ్యమైన వైద్యం అందించి గ్రామీణులకు అండగా ఉండాలని కోరారు. ఆయన వెంట పార్టీ కన్వీనర్ ధనంజయవర్మ, శేషాద్రి, పురంధర్ తదితరులు పాల్గొన్నారు.